ఆఫీసు సూపరింటెండెంట్ వెంకట్రామయ్య గంట ఆలస్యంగా వచ్చాడు.

'హమ్మయ్య' అని నిట్టూర్చి సీట్లో కూర్చుని టవల్‌తో ముఖం తుడుచుకున్నాడు. అతి కష్టంగా పెన్ను తీసి అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టాడు. అటెండర్ రాజయ్య గ్లాసుతో మంచి నీళ్ళు తెచ్చి టేబుల్ మీద ఉంచి మూతపెట్టాడు.

"నమస్తే!'' అంటూ ఏభైఏళ్ళు దాటిన పెద్దమనిషి వచ్చి సూపరింటెండెంట్ ఎదురుసీట్లో చొరవగా కూర్చున్నాడు.

"నమస్తే మూర్తిగారూ? ఎప్పుడొచ్చారు?'' అంటూ షేక్‌హ్యాండ్ ఇచ్చాడు సూపరింటెండెంట్.

ఇద్దరూ మాటల్లో పడ్డారు.

"సార్! యాక్షన్ టేకెన్ రిపోర్ట్ అర్జెంట్‌గా సెక్రటేరియట్‌కి పంపాలి. ఈరోజు చూస్తానన్నారు'' సీనియర్ అసిస్టెంట్ గోపాల్ సూపరింటెండెంట్‌తో అన్నాడు.

సూపరింటెండెంట్ అతని వైపు కొరకొర చూశాడు.

"చూస్తాలేవయ్యా! బోడి ఫైలు. క్షణం తీరిక లేదు, దమ్మిడీ ఆదాయం లేదు'' అని విసుక్కున్నాడు.

బెల్‌కొట్టి అటెండర్ని పిలిచి రెండు స్ట్రాంగ్ కాఫీ తీసుకురా అన్నాడు.

"పబ్లిక్ అకౌంట్స్ కమిటీ రిపోర్టులని దరిద్రపు సీటొకటి నా సెక్షన్లో వచ్చింది. ఎవడో ఎక్కడో ఏదో డివిజన్లో కుంభకోణాలు చేస్తాడు. ఆడిట్ వాళ్ళు తీగలాగుతారు. డొంక కదులుతుంది. ఆ కేసు పిఏసికి పోతుంది. ఇక సంవత్సరాల తరబడి ఫైళ్ళు తిరుగుతుంటాయి. గవర్నమెంట్ నుంచి షంటింగులు వస్తుంటాయి. ఛస్తున్నాననుకో. ఈ ఉద్యోగం నుంచి ఎప్పుడు రిటైరైపోతానా? ఎప్పుడు విముక్తి కలుగుతుందా దేవుడా అనిపిస్తోంది మూర్తిగారూ!'' సూపరింటెండెంట్ సొద వెళ్ళబోసుకున్నాడు.

మూర్తి తల ఊపుతూ కూర్చున్నాడు.

అటెండర్ రెండు కప్పుల్లో కాఫీ తెచ్చి ఇద్దరి ముందూ పెట్టాడు. సూపరింటెండెంట్ కప్పు నోటి దగ్గర పెట్టుకుని కాఫీ సిప్ చేసి "ఇంత చల్లగా వచ్చిందే కాఫీ?'' అని ఎగిరాడు.

"ఫ్లాస్క్ పగిలిపోయింది సార్. కప్పుల్లో తెచ్చాను'' అన్నాడు అటెండర్.

"ఎందుకు పగిలింది?''


"చెయ్యి జారింది సార్!''

"చెయ్యి జారుతుంది. కాలు జారుతుంది. ఒళ్ళు దగ్గర పెట్టుకోవద్దా? వెళ్ళు వెళ్ళి కొత్తది కొనుక్కురా. పగలగొట్టినవాడివి కొత్తది తేవాలని తెలీదా? ఆఫీసులో డబ్బులెక్కడున్నాయి కొనడానికి'' అని అటెండర్ మీద విరుచుకుపడ్డాడు సూపరింటెండెంట్.

రాజమ్మ ముఖం చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయాడు.

ఇంతలో ఏదో పెద్ద శబ్దమైంది. స్టాఫ్ అంతా ఏం జరిగిందోనని ఆఫీసు బైటకు వచ్చి చూస్తున్నారు.

ఆఫీసర్ గారి అబ్బాయి పదిహేనేళ్ళ వాడు ఆఫీసు కారులో కూర్చుని ఇగ్నిషన్ కీ తిప్పి స్టార్ట్ చేశాడు. అది వెళ్ళి ఎదురుగా ఉన్న గోడకు గుద్దుకుని ఆగిపోయింది. కారు హెడ్‌లైట్లు పగిలి ముక్కలయ్యాయి. ముందు భాగం దెబ్బతింది.




ఆఫీసర్ గారు బైటకొచ్చి డ్రైవర్ మీద ఎగిరాడు.

కారు కీస్ అక్కడ ఎందుకుంచావని తిట్టాడు. నేను అక్కడ ఉంచలేదు. మహాప్రభో! అబ్బాయిగారు లాక్కెళ్ళారని డ్రైవర్ మొత్తుకుంటున్నాడు. ఐనా డ్రైవర్‌ని నానామాటలు అన్నాడు.

తర్వాత కొడుకుని తిడుతుంటే సూపరింటెండెంట్ వెళ్ళి అడ్డుపడ్డాడు.

"సార్ ఊరుకోండి సార్! చిన్న పిల్లవాడు. ఏదో సరదా పడ్డాడు. ఏం జరగలేదు గదా! షెడ్‌కి పంపించి వెంటనే రిపేర్ చేయిస్తా. మీరెళ్లండి సార్'' అంటూ సూపరింటెండెంట్ ఆఫీసర్ని బ్రతిమాలుతూ లోపలకు పంపించాడు.

"అబ్బాయిగారూ! మీరెళ్ళి లోపల కూర్చోండి. ఏయ్ రాజయ్యా! అబ్బాయిగారికి కూల్‌డ్రింక్ తెచ్చివ్వు'' అని హుకుం జారీచేశాడు సూపరింటెండెంట్.

అటెండర్ అబ్బాయిగారికి కూల్‌డ్రింక్ తేవడానికి పరిగెత్తాడు. డ్రైవరేమో కారు తీసుకుని షెడ్‌కి బయల్దేరాడు.

"అందుకే రూల్స్ సాలెగూడు అన్నారెవరో. చిన్న చిన్నవాళ్ళని కబలిస్తాయి. పెద్దవాళ్ళు సాలెగూడునే బూజు కర్రతో దులిపి పారేస్తారు'' ఎవరో గొణిగారు.

★